# తెలంగాణలో ఎంట్రన్స్‌లన్నీ వాయిదా

## కరోనా వ్యాప్తి నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలో ఎంసెట్ సహా అన్ని ప్రవేశ పరీక్షలను ఆ రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసింది. రాష్ట్రంలో కరోనా వైరస్ కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో బుధవారం నుంచి జరగాల్సిన అన్ని ప్రవేశపరీక్షలను వాయిదా వేస్తున్నట్లు హైకోర్టుకు తెలిపింది. ఎంసెట్, పాలిసెట్, ఐసెట్, ఈసెట్, పీజీ ఈసెట్, లాసెట్, పీజీ ఎల్ సెట్, ఎడ్‌సెట్, పీఈ సెట్, ఇతర డిప్లొమా, టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్. చౌహాన్, జస్టిస్ బి. విజయసేన్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనానికి ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) బి.ఎస్. ప్రసాద్ నివేదించారు. డిగ్రీ, పీజీ పరీక్షలపై జేఎన్‌టీయూ చేసిన ప్రతిపాదనల విషయంలో ఏ నిర్ణయం తీసుకున్నదీ జూలై 9న జరిగే విచారణలోగా తెలియజేయాలని ధర్మాసనం ఆదేశించింది.